క్లుప్తంగా

లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

మెట్‌పల్లి: లక్ష్యం మేరకు ఆస్తి పన్ను, నల్లా, ట్రేడ్ లైసెన్స్ బిల్లులను వసూలు చేయాలని అడిషనల్ కలెక్టర్ లత సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్ల తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు సకాలంలో చెల్లించేలా చొరవ తీసుకోవాలన్నారు. గడువు లోపు మిగిలి ఉన్న బకాయిలను వసూలు చేయాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ ప్రగతి గురించి టౌన్ ప్లానింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కమిషనర్ మోహన్ ఉన్నారు.

పాఠశాలల్లో డీఈవో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాము

వెల్గటూర్ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్ తో పాటు ముత్తునూర్ జెడ్పీ హైస్కూల్‌ను జిల్లా విద్యాధికారి రాము మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండపల్లి మండలంలో తొలమెట్టు కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నర్సింగం, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, సృజనవేని తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వల పరిశీలన



యూరియా బస్తాలు పరిశీలిస్తున్న డీఏవో, డీసీవో

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట సహకార సంఘం గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్, జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. గోదాంలో యూరియాకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం యూరియా నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. పంటలకు సరిపడేలా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో యోగితా, సీఈవో అరుణ్‌కుమార్, ఏఈవో హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలు పన్నులు చెల్లించాలి



రశీదు అందిస్తున్న కమిషనర్ మనోహర్‌గౌడ్

రాయికల్: పట్టణ ప్రజలు, వర్తక వ్యాపారస్తులు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకిరంచాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పాత బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. ట్రేడ్ లైసెన్స్, ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. ఆయన వెంట మేనేజర్ వెంకటి, సిబ్బంది ఉన్నారు.

నువ్వుల పంటతో అధిక ఆదాయం

జగిత్యాలఅగ్రికల్చర్: వేసవిలో పసుపు పంట తర్వాత నువ్వులు సాగు చేసి మంచి ఆదాయం పొందవచ్చని నువ్వుల శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం రాయికల్ మండలం అల్లీపూర్‌లో నువ్వుల పంటపై మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ నువ్వుల పంట స్వల్పకాలంలో చేతికి వచ్చే పంటని తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన నువ్వుల పంటను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యక్రమ ఇన్‌చార్జి రజనీదేవి, శాస్త్రవేత్త బలరాం, శంకర్, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా మల్లికార్జునస్వామి అగ్నిగుండాలు

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామంలో మల్లిఖార్జునస్వామి అగ్నిగుండాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ భక్తులు ఆలయంలో పూజలు చేశారు. అగ్నిగుండం గుండా శివసత్తులు, భక్తులు నడుచుకుంటూ వెళ్లారు.భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయ హుండీని మంగళవారం అధికారులు లెక్కించారు. హుండీ ఆదాయం రూ.8,768, వివిధ సేవా టికెట్ల ఆదాయం రూ.36150,పది గ్రాముల వెండి కానుకలు వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




మల్లికార్జునస్వామి ఆలయంలో పట్నాలు

రాయికల్/సారంగాపూర్: మండలంలోని కట్కాపూర్ శివారులో వెన్నముద్దల గండి వద్దనున్న మల్లికార్జున స్వామి, గొల్లకేతమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఆలయంలో పట్నాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, యాదవ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ..

ధర్మపురి: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న రాజారం ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు పట్నాలు వేశారు. ప్రతీ ఏడాది వేసవి సందర్భంగా ఎల్లమ్మ తల్లికి భక్తుల సందడి నెలకొంటుంది. వచ్చిన భక్తులంతా అమ్మవారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించి పట్నాలు వేసి ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించారు.

యమ ధర్మరాజుకు ప్రత్యేక పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయం శ్రీ యమధర్మరాజు దేవాలయంలో మంగళవారం భరణి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చారణలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో గుంతల రోడ్డు..

- అభివృద్ధికి నోచుకోని మల్యాల- జగిత్యాల రహదారి
- పదేళ్లుగా మరమ్మతు కరువు
- భారీ గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు



మల్యాల- జగిత్యాల రోడ్డుపై గుంతలతో అస్తవ్యస్తంగా రోడ్డు

మల్యాల: రోడ్డు వేసి దశాబ్దకాలం అవుతున్న మరమ్మతులు చేపట్టడం మరిచారు. రోడ్డంతా భారీ గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారు. సుమారు ఆరు కిలోమీటర్ల మేర అడుగడుగునా గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల గ్రామ ప్రజలతోపాటు ఇతర గ్రామాల ప్రజల సౌకర్యం కోసం రోడ్డు వేసినా, ఏనాడు రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. మండల ప్రజల సౌకర్యం కోసం మల్యాల ఒడ్డెర కాలనీ నుంచి నూకపల్లి శివారులోని వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల వద్ద జగిత్యాల -కరీంనగర్ జాతీయ రహదారి వరకు సర్వీస్ రోడ్డు వేసి, దశాబ్దకాలం గడుస్తోంది. అప్పటి రోడ్డు భవనాల శాఖ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి చొరవ తీసుకొని, జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి నుంచి మల్యాలలోని ఒడ్డెరకాలనీ వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు వేయించారు. కానీ మరమ్మతులు లేక గుంతలు పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుతో అభివృద్ధికి బాటలు..

మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి, తాటిపల్లి, మానాల, మ్యాడంపల్లి, లంబాడిపల్లి గ్రామాలతోపాటు, పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలతోపాటు జగిత్యాల నుంచి మల్యాల మండలానికి వెళ్లే వారికి ఈ రోడ్డు సౌకర్యవంతంగా ఉంటుందని అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి రోడ్డు వేయించడంతో వ్యవసాయ భూముల ధరలు పెరగడంతోపాటు, అభివృద్ధికి బాటలు పడ్డాయి.

అడుగడుగునా భారీ గుంతలు..

భారీ గుంతలతో ఆ రోడ్డు వెంట వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి నుంచి నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే దారిలో భారీ వాహనాలు నడుస్తుండడంతోపాటు, భారీ వాహనాలు ఈ రోడ్డు వెంట వెళ్తుండడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు బైపాస్ రోడ్డు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతుచేపట్టాలి



మల్యాల బైపాస్ రోడ్డుతో ఎంతో సౌకర్యం ఏర్పడింది. రోడ్డును దశాబ్దకాలంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో భారీ గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ఈ రోడ్డుగుండా వెళ్లేందుకు జంకుతున్నారు. రోడ్డు మరమ్మతు చేపట్టడంతోపాటు మూలమలుపు వద్ద రేడియం ఏర్పాటు చేయాలి. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తే, ఈ రోడ్డు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

– సింగనవేని మల్లేశం, తాటిపల్లి

భూముల విలువ పెరిగింది



మల్యాల- జగిత్యాల రోడ్డు కోసం నా భూమి కొంత కోల్పోయినప్పటికీ భూముల విలువలు పెరిగాయి. అప్పటి రోడ్డు భవనాల శాఖా మంత్రి జీవన్ రెడ్డి చొరవ చూపి,ఈ రోడ్డు వేయించడంతో రోడ్డు వెంట ఉన్న భూములకు డిమాండ్ పెరిగింది. వాహనదారుల రాకపోకలతో సందడి నెలకొంది. బైపాస్ రోడ్డు అనువుగా ఉండడంతో ఫంక్షన్‌హాల్ కట్టిన. రోడ్డు మరమ్మతులు చేయాలి.

– కరబూజ నర్సయ్య గౌడ్, మల్యాల

బీజేపీ నాయకుల సంబరాలు



జగిత్యాల, కోరుట్లలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/కోరుట్ల/మెట్‌పల్లి/ధర్మపురి/కథలాపూర్/సారంగాపూర్/మల్యాల/పెగడపల్లి: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన మల్క కొమురయ్య విజయం సాధించడంతో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రం, పలు మండల కేంద్రాల్లో నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థుల ఫేర్‌వెల్ హంగామా

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో మంగళవారం ఎస్సెస్సీ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్,హెచ్ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మల్క కొమురయ్య విజయం నవశకానికి నాంది

జగిత్యాలటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం నవశకానికి నాంది అని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో తపస్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, రాష్ట్ర బాధ్యులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, కూర్మాచలం రఘునందన్ పాల్గొన్నారు.

లైన్‌మెన్ల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎస్ఈ సాలియా నాయక్

మెట్‌పల్లిరూరల్: విధి నిర్వహణలో లైన్‌మెన్ల సేవలు అభినందనీయమని జిల్లా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలియానాయక్ అన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్ సమావేశం మందిరంలో మంగళవారం నిర్వహించిన లైన్‌మెన్ దినోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వినియోగదారులకు సేవలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో లైన్‌మెన్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో డీఈ గంగారాం, ఏడీఈ మనోహర్, ఏఈలు రవి, అజయ్,సబ్ ఇంజినీర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

లైన్‌మెన్లకు సన్మానం

రాయికల్: గ్రామాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత సరఫరా చేస్తున్న లైన్‌మెన్ సేవలు మరువలేనివని ఏడీఈ సిందూర్‌శర్మ అన్నారు. లైన్‌మెన్‌ల దినోత్సవం సందర్భంగా సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్లను సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ తుమ్మల నవీన్ పాల్గొన్నారు.

బుగ్గారం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం లైన్‌మెన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మండలంలో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఏఈ రాజశేఖర్ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిని సేవలను ప్రశంసించారు.

జిజ్ఞాస ప్రదర్శన విజయవంతం

జగిత్యాల: హైదరాబాద్‌లోని నాంపల్లి ఇందిర ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో జగిత్యాల మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. వారు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మమత కాలియ కథ సేవ వృద్ధ విమర్శ అనే అంశాలపై రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా, ఈ ప్రాజెక్ట్‌ను నైపుణ్యంగా నిర్వహించారు. చివరి వారంలో ఫలితాలు రానున్నాయి. ప్రాజెక్ట్ ఎంపికైతే జాతీయస్థాయికి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, చంద్రయ్య, రహీం, వరప్రసాద్ అభినందించారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

మల్లాపూర్: ఉగాది, రంజాన్ పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై రాజు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలందరు సోదరభావంతో మతసామరస్యాన్ని పాటిస్తూ ఉగాది, రంజాన్ పండుగలను జరుపుకోవాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడపుల పుష్పలత, నాయకులు గంగాధర్, ముస్లి మైనార్టీ కమిటీ మండల అధ్యక్షుడు అబ్దుల్ రజాక్,సభ్యులుపాల్గొన్నారు.

తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: పట్టణంలోని ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ తెలిపారు. రూ.వెయ్యి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు అనుమతి లేని లేఅవుట్లలో, ఖాళీ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్‌కు ఈనెల 31లోపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని శివాజీనగర్‌లో శ్రీనల్ల పోచమ్మతల్లి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి అమ్మవారి హుండీ బీరువాను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. రూ.70 వేల విలువ గల విద్యుత్ సామగ్రిని కూడా ఎత్తుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ ఎస్సై కిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీసులో చోరీకి యత్నం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి యత్నించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని కిటికీలు తెరిచి లోనికి వెళ్లేందుకు దొంగలు ప్రయత్నించినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై మన్మథరావు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి పరిశీలించారు.

సఖీ కేంద్రానికి యువతి

జగిత్యాలక్రైం: ప్రేమ విఫలమైందని ప్రియుని ఇంటి ముందు ఆత్మహత్యకు యత్నించిన యువతిని పోలీసులు రక్షణ కోసం సఖీ కేంద్రానికి తరలించారు. జగిత్యాల బైపాస్‌రోడ్‌లో ఉంటున్న ఓ యువకుడికి నెల్లూరుకు చెందిన యువతితో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. యువతి తనను పెళ్లి చేసుకోవాలని యువకున్ని కోరడంతో అతను నిరాకరించాడు. దీంతో యువతి మూడురోజుల క్రితం జగిత్యాలకు వచ్చి ప్రియుని ఇంటి ముందు ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు చేరదీసి రక్షణ కోసం సఖీ కేంద్రానికి తరలించారు. కాగా, యువతి సఖీ కేంద్రంలో ఉండేందుకు నిరాకరించడంతో సఖీ కేంద్రం సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

వన్యప్రాణి మాంసం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

సారంగాపూర్: మండలంలోని లచ్చనాయక్‌తండా గ్రామానికి చెందిన సురేందర్, సంతోష్, ప్రకాశ్ వేటాడిన వన్యప్రాణి మాంసం అమ్మడానికి సిద్ధం చేస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు వారి నుంచి మాంసం స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పద్మారావు, శ్రీనివాస్, డెప్యూటీ రేంజర్ రవికుమార్, సెక్షన్ అధికారులు శ్రీనివాస్, సాంబయ్య, నరేష్, బీట్ అధికారులు, బేస్‌క్యాంపు సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన బోడుగం మనోజ్‌కు చెందిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంగళవారం సాయంత్రం దగ్ధమైంది. పశువుల కోసం నిల్వ చేసిన పశుగ్రాసానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఇళ్లు ఉండటంతో ప్రజలంతా భయబ్రాంతులకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పేసి ప్రమాదాన్ని నివారించారు.

నిందితుడికి రిమాండ్

కోరుట్ల: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పిట్టల శ్రీధర్ పై పోక్సో కేసు నమోదు కాగా నిందితుడు కోర్టుకు హాజరు కాలేదు. దీంతో కోర్టు నిందితుడికి నాన్ బెయిలెబుల్ వారెంట్ జారీ చేసింది. పోలీసులు మంగళవారం నిందితున్ని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.


రైతాంగ సమస్యలపై పోరాటంతోనే గుర్తింపు



కిసాన్‌సంఘ్ దినోత్సవంలో నాయకులు

మల్లాపూర్: రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటంతో భారతీయ కిసాన్‌సంఘ్‌కు గుర్తింపు దక్కిందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి, మండల అధ్యక్షుడు క్లోం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో భారతీయ కిసాన్‌సంఘ్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించే పంటలు అటవీ జంతువుల దాడులతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం త్వరగా అందించాలన్నారు. 70 ఏళ్ల వయస్సులో వ్యవసాయం చేస్తున్న రైతు వెల్మల గంగారెడ్డి, ఎలక్ట్రీషన్ సోమేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ గ్రామ అధ్యక్షుడు పోచంపల్లి చిన్నరమేశ్ రెడ్డి, మండల రెవెన్యూ ప్రముఖ్ చిట్యాల లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుసంధానం చేయాలి



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: పట్టణంలోని బీఎస్సీ అగ్రికల్చర్ బాలికల కళాశాలను రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెక్రటరీ అలుగు వర్షిణిని మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కోరుట్ల బీఎస్సీ అగ్రికల్చర్ బాలికల కళాశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు రోడ్డెక్కారని కళాశాలకు సరైన వసతులు, ఫ్యాకల్టీ, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సుధీర్‌రావు

రాయికల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాయికల్ ఎస్సై సుధీర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సైకాలజిస్ట్ శ్రీహరి, కరస్పాండెంట్ ఎద్దండి ముత్యపు రాజిరెడ్డి, డైరెక్టర్ నివేదితరెడ్డి పాల్గొన్నారు.